






# మొక్కు



నారాయణరావుకు రోజూ దేవాలయానికి వెళ్ళే అలవాటు. ఏ ఊరు వెళ్ళినా సాయంకాలం అలా షికారు వెళ్ళి

దూరంగా ఏదేనా గోపురం కనిపిస్తే దగ్గరగా వెళ్ళి, దైవదర్శనం చేసుకుని,కాసేపు మంటపంలో కూచుని, ప్రశాంతతను అనుభవిస్తేనే గాని తృప్తి వుండదు; ఆ రాత్రి అతడికి సుఖంగా నిద్రపట్టదు.

అతడికి భగవద్భక్తిని గురించి విశేషంగా యేమీ తెలియదు. సనాతనాచార సంప్రదాయాల యెడ విశ్వాసం కూడా యేమీ లేదు. పురాణపురుషుల మహిమలు, భారత భాగవతాలలోని కథలూ, ఋషులను గురించిన కథలలోని అసంభావ్యములైన విషయాలూ, నారాయణరావు పట్టించుకోడు. ఆకథలలోని, ఆ మహా పురుషుల జీవితాలలోని సంఘటనలకు సంబంధించిన, అంతరార్థాలను గురించి అతడు ఆలోచించడు. సరిపెట్టుకోలేని కొన్ని విషయాలను గురించి, సమాధానపడేందుకు ప్రయత్నించడు. అయినా రోజూ దేవాలయానికి వెళతాడు. ఏదో తనను నిలువనీయని ఒక ఆర్తికి కొంత ఉపశమనాన్ని, ఆలయంలో పొందగలిగినట్లు అతడు భావించుకొనటంవలన, రోజూ వెళతాడని చెప్పుకోవచ్చును. ఏదో ఒక జిజ్ఞాస, ఒక ఆరాటం, నారాయణరావు మనశ్శాంతిని యెప్పుడూ కొల్లగొడుతూనే వుంటుంది.

చిన్నతనం నుంచీ అతడికి ఆలయానికి వెళ్ళేఅలవాటుంది. పెద్దదైన తరువాత గూడా అతడికా అలవాటు పోలేదు. చిన్నప్పటి అలవాటు కాబట్టి, బిడియంగానూ, సిగ్గుగానూ ఏమీ వుండదు. క్రొత్తవాళ్ళు, తాను గుడికి వెళుతున్నప్పుడు చూసినా !

అయితే గుడికి ఎందుకుపోవాలి? అన్న ప్రశ్న వచ్చినప్పుడు సరియైన సమాధానంరాక, నారాయణరావు కళవళపడేవాడు. నీతి ముఖ్యం కాని, భక్తి కాదని అతడికీ తెలుసు. అనేకమంది నీతిలేనివాళ్ళు గుళ్ళో తనకు తారసపడుతూ వుండటమూ చూస్తూ వున్నాడు. అయినా ఇన్ని ఆలోచనలు తనకెందుకు? ఈ విషయాలన్నీ ఆలోచనచేసి నిగ్గుతేల్చగల సమర్థత తనకు లేదు. తన అలవాటును పోగొట్టుకొనవలసిన అవసరం మాత్రం లేదన్న నిశ్చయానికి మాత్రమే 'అతడు రాగలిగాడు.

కాని ఒకందుకు అతడు విపరీతంగా బాధపడతాడు. దేవాలయంలోకి వెళ్ళి, భగవంతుని ముందు చేతులు జోడించి నిలిచి, మనస్సు లగ్నం చేయాలని ఆరాటపడుతున్న సమయంలోకూడా, అనేకములైన కామనలు, ఈర్ష్యాద్వేషాలు, తప్పుడు ఆలోచనలు, స్వార్థం, అసూయ, జీవితంలో అసంతృప్తి తనను విడిచిపెట్టి పోయేవికావు.



ఎప్పటికైనా వీటన్నిటినుండీ విముక్తి లభిస్తుందనే ఆశతోనే, ప్రయోజనంతోనే నారాయణరావు రోజూ గుడికివచ్చి ప్రదక్షిణాలుచేసి, దైవదర్శనం చేసుకుంటున్నాడు.

నారాయణరావుది జాలిగుండె. మెత్తని మనసు. తన బలహీనతలను గురించి తనకు క్షుణ్ణంగా తెలుసు. వాటిని వదల్చుకోలేనందుకు, ఏకాంతంగా, సిగ్గుపడుతుంటాడు. తనని తానే నిరసించుకుంటూ ఉంటాడు.

"డిగ్రీ కోర్సు" పూర్తిచేసి నారాయణరావు ఎమ్, ఏ. చదువు కునేందుకు హైదరాబాదు వచ్చాడు. యూనివర్శిటీలో చేరిపోయి, హాస్టలులో వుంటూ చదువు సాగించాడు. హాస్టల్లో భోజనంతో కూడా యెలాగో రాజీపడ్డాడుగాని, ప్రముఖంగా, దగ్గర్లో యెక్కడా దేవుడి గుడిలేకపోవటం అతడికి సమస్యే అయింది. ఎటు పోవాలన్నా సిటీ బస్ మీద రెండు మూడు మైళ్ళు వెళ్ళవలసిందే. ఒంటరిగా ఏదో బీదతనంతో బాధ పడుతున్నట్లున్న దేవుళ్ళను చూస్తే అతడికి భయమూ-దిగులూ. అందుచేత నిత్యనైవేద్య దీపారాధనలతో కలకల లాడుతూ, నలుగురు వచ్చిపోతూ వుండే గుడికి పోవటమే నారాయణరావుకి ఇష్టం.

హైదరాబాదుకు వచ్చిన వారం రోజుల్లో, ఇదిఒక ప్రముఖ సమస్యగా పరిణమించి నారాయణరావు దిగులు పడ్డాడు. హాస్టల్లో చుట్టుపట్ల గదుల్లో వున్నవాళ్ళను కొందరిని వాకబు చేశాడు. వాళ్ళలో కొందరు నారాయణరావును వింతగా చూశారు. కొందరు పరిహాసంగా చూశారు. కొందరు అనాగరికుడు అన్నట్లు చూశారు. కొందరు మాత్రం మెచ్చుకొని గౌరవించారు. సరే ఒక మిత్రుడు పాపం నారాయణరావును వెంటపెట్టుకొని ఒక సాయంకాలం, చిక్కడపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి తీసుకుని వెళ్ళాడు. నారాయణ రావుకు చాలా సంతోషమైంది. కాని ఇది ఒక సమస్యే. రోజూ రావాలంటే రెండు మూడుగంటల పని. ఎనిమిదిన్నర దాటితే హాస్టల్లో భోజనం వుండదు. బస్ కోసం వెయిట్ చేయటం, యువతీ మండలి స్టాప్ దగరదిగి కొంతదూరం నడవటం, ఇవన్నీ సమస్యలే. అందువలన ఎప్పుడూ వారం రోజులకోసారి మాత్రమే దేవాలయానికి వెళ్ళగలుగుతున్నాడు.

మంజుశ్రీ

ఓ రోజున నారాయణరావు దేవాలయానికి వెళ్ళాడు. సాయంకాలం పొడి పొడిగా చినుకులు పడి వెలిశాయి. ఆవాళ, గుళ్లో తొక్కిడిగా లేదు. మళ్ళీ వానవచ్చే సూచనలు కనపడుతున్నాయి. ఒకరూ, ఇద్దరూ వచ్చి దండం పెట్టుకొని వెళుతున్నారు. ఆవాళెందుకో మనసు కొంచెం ప్రశాంతంగా వుంది. మంటపంలో చాలాసేపు కూచుండి పోయాడు నారాయణరావు. ఇంతలో వాన వచ్చింది. ఆ దృశ్యం మనోహరంగా వుంది.


ప్రొద్దుపోతున్నదని నారాయణరావు లేచాడు. అప్పటికింకా సన్నగా తుప్పర పడుతూనే వుంది. సింహద్వారం దాకావచ్చి, యథాలాపంగా తన చెప్పులు జత కోసం వెతుక్కున్నాడు. తన చెప్పులు కనిపించలేదు. చాలా జాగ్రత్తగా చుట్టు ప్రక్కల ప్రదేశమంతా వెతికాడు. కాని ఎక్కడా కనిపించలేదు. నారాయణరావుకి చాలా విచారం కలిగింది. యూనివర్శిటీలో చేరే ముందే వాటిని కొనుక్కున్నాడు. ఖరీదుకూడా ఎక్కువే. పన్నెండు రూపాయలైనవి. మళ్ళీకొనుక్కోవాలన్నా, ఇప్పుడు తనకు చేతకాదు. ఎవరినో అప్పు అడగాలి.

ఎవరో కావాలనే తీసుకొని వెళ్ళారన్న ఆలోచన ఎంతో బాధాకరంగా వుంది అతడికి. అక్కడ దేనికోసమో వెతుకుతూంటే, సింహద్వారం ముందు పూలూ, పళ్ళూ, కొబ్బరికాయలూ అమ్ముకుంటూవుండే వాళ్ళు ఏమిటని అడిగారు. నారాయణరావుకు వాళ్ళు తనను అట్లా అడగటం ఇష్టంలేదు. ఐనా తాను అక్కడ తచ్చాడుతుంటే అడిగారు కాని, వాళ్ళ తప్పేముంది! "చెప్పులు కనపడటంలేదు" అని చెప్పాడు. అక్కడున్న వాళ్ళలో కొందరు వెకిలిగా నవ్వితే నారాయణరావుకు కత్తిపెట్టి పొడిచినంత బాధ కలిగింది. ఎవరో సానునయంగా "ఎవరో దుర్మార్గులు యెత్తుకొనిపోయి వుంటారు" అని సానుతాపం వెల్లడించారు. నారాయణరావుకు వీళ్ళ ఓదార్పుకాని, వాళ్ళ పరిహాసంకాని పట్టలేదు. మనుషుల దుర్మార్గమే మనస్సును అమితంగా బాధిస్తున్నది. "ఈమధ్య ఇట్లా చెప్పులు పోవటం జాస్తి అయింది" అన్నా రొకరు.

నారాయణరావు తల ఎత్తిచూస్తే అక్కడ "చెప్పులదొంగలతో జాగ్రత్త" అని పెద్ద పెద్ద అక్షరాలతో ఒక అట్ట మీద వ్రాసి వ్రేలాడగట్టబడి వుంది. నారాయణరావుకు అమితమైన బాధ కలిగ్గింది. దేవాలయంలోకూడా, సినిమాహాలులోలాగానూ, రైలుబండిలోలాగానూ "దొంగలతో జాగ్రత్త" అని వ్రాసివున్నందుకు అతడెంతో ఖిన్నుడైనాడు. తన చెప్పులుపోవటం సంగతి అట్లావుంచి, ప్రపంచం ఇలా అయిపోవటం అతడు భరించలేడు.

ఇంతలో ఓ వృద్ధుడు అక్కడికి






వచ్చాడు. బిళ్ళగోచీ పెట్టుకుని, పైన ఉత్తరీయం వేసుకొని సింహద్వారం దగ్గర నిల్చుని నమస్కారం చేస్తున్నాడు. ఆయన ప్రక్కకు తిరిగి అక్కడెవరినో ప్రశ్నించాడు. వాళ్ళు చెప్పారు. ఆ వృద్ధుడు ఎంతో బాధపడిపోయి "అయ్యో! ఎంత చెడ్డకాలం వచ్చింది? మనుషులంతా ఏమైపోతున్నారు? దేవాలయంలో చెప్పులు దొంగిలించినవాడికి కుక్క జన్మ వస్తుందని శాస్త్రం చెపుతున్నది. వాడెవడో కుక్కై పుడతాడు" అని బాధగానూ, కోపంగానూ నిరసిస్తున్నట్లు అని గుళ్ళోకి వెళ్ళిపోయాడు.

నారాయణరావు వొట్టిపాదాలతోనే తిరిగి పోయినాడు. అతడి సున్నితమైన మనస్సు విపరీతంగా బాధపడసాగింది. వాడెవరో, తన చెప్పులను ఆరుకో, ఏడుకో అమ్ముకుంటాడు. ఒకరోజో, రెండురోజులలో ఖర్చుపెట్టుకుంటాడు. అంతటితో జీవితం ముగిసిపోతుందా? అయ్యో! ఎవరోవాడు—తన చెప్పులను దొంగిలించినవాడు? వాడిపైన యెంతో జాలికలిగింది నారాయణరావుకు.

ఆ రాత్రంతా అదే ఆలోచనతో, అదే దుఃఖంతో, దిగులుతో, అసంతృప్తితోగడిపాడు నారాయణరావు. నారాయణరావుకు ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. చిత్రవిచిత్రములైనకలలు వచ్చాయి. కలలనిండా దుఃఖమూ, భయమూ, దిగులూ, జాలీ, అసంతృప్తి. తనకు తొమ్మిదేళ్ళప్పుడు స్కూలునుంచి ఇంటికి తిరిగివస్తుంటే


పదిమంది పెద్దవాళ్ళు, పెద్ద పెద్ద లాఠీకర్రలు, నాటుకట్టెలూ పట్టుకుని, ఓ కుక్కను తరుముతున్నారు. అది వాళ్ళకు చిక్కకుండా పోవాలని భయంతో, మొండి తెగింపుతో, క్రౌర్యంతో, ప్రయత్నం చేస్తున్నది. అయినా పదిమందీ, తలో దిక్కూ చేరి, చుట్టుముట్టారు. నల్లకుక్క. కళ్ళు ఎఱ్ఱగా మండిపోతున్నాయి. నోటి వెంబడి చొల్లు కారిపోతున్నది. మధ్య మధ్య ఎఱ్ఱని రక్తపు జీరలు కూడా నోటివెంట పడుతున్నాయి. ముడుచుకొని, కుయ్యో మొఱ్ఱో, రక్షించండర్రోయ్ అంటూ దీనంగా, దిగులుగా, వేడుకుంటున్నట్లు, ప్రాధేయపడుతున్నట్లుచూస్తూ తనను తాను అర్పించుకుంది. ఎవరికీ జాలి లేదు. దయలేదు. అన్ని కర్రలూ వొక్కసారిగా దానిమీద నేపడ్డాయి. ఎముకలు పిండి పిండి అయిపోయినయ్. రక్తపు మడుగులో కుక్క కుప్ప కూలి పోయింది. తల పగిలి పోయింది. పలువరుస వికృతంగా బయటకు పొడుచుకుని వచ్చింది. కాళ్ళూ, తోకా, ఆడిస్తూ, విలవిలలాడి, కుయ్యోమని పేగులన్నీ బయటపడేలా అరుస్తూ ప్రాణాలు విడిచింది.

తాను చూడలేక పోయినాడు నారాయణరావు. కాని తనముందే జరిగింది ఇంత ఘోరం. తాను ఆ గుంపును తప్పించుకొని ఇంటికి పోవటానికి వీల్లేదు. దారి లేదు. చూడవలసి వచ్చింది. చూశాడు. తరువాత రెండు రోజులు జ్వరం కూడా వచ్చింది. అది పిచ్చికుక్కట. అంతకు క్రితం రోజున ఇద్దరు చిన్న పిల్లలను కరిచింది. ఒకడు క్రితం రోజు, ఒకడు ఈ రోజు ఆస్పత్రిలో చచ్చిపోయినారు. ఆ దుఃఖంతో రెచ్చిపోయినారు మనుషులు.

ఇంకోసారి తమఇంట్లోనే ఒక కుక్క అలవాటుగా పెంపుడుకుక్కలాగా వుండేది. ఇంటిల్లిపాదీ ఎంతో మాలిమిగా వుండేవాళ్ళు దానితో. ఎంతో ప్రేమించేవాళ్ళు. ఎవరినీ ఏమీ అనేదికాదు. నోట్లో వేళ్ళు పెట్టినా ఏమీ అనేదికాదు. చెవులు పట్టి లాగినా, చిన్నపిల్లలు తోకపట్టి లాగినా, కొట్టినా "భౌ" మనికూడా దడిపించేదికాదు. ఎక్కడెక్కడో వొక కబళంతిని, రాత్రికి మాత్రం పడుకోటానికి చేరేది. అమిత సాధువుగా వుండేది ఆ కుక్క. ఓసారి, ఫుండువంటి చలికాలంలో వేపచెట్టు కింద ఇసుకకుప్ప చాటున ఎనిమిది పిల్లలను పెట్టిందాకుక్క. ఇంటి మరామత్తుకోసం, ఇసుకను తోలించారప్పుడు. కాని అచలికో, మరి దేనికో, ఆ పిల్లలు బ్రతకలేదు. పదిహేను, ఇరవైరోజుల తరవాత, ఒక పిల్ల చనిపోతే పనివాళ్ళచేత తీసిపారేయించారు. ఆ తరువాత వరసగా రెండు మూడు రోజులకో పిల్ల చొప్పున అన్ని పిల్లలూ చనిపోయినయ్. పాపం దాని దుఃఖం








దుఃఖంకాదు. ఆ చెట్టుకిందమూ చూస్తూ, అన్నం నీళ్ళూమాని, ఆర్నెల్లు ఓ అని కేకలుపెడుతూ, కృశించి కృశించి చనిపోయింది. రోజూ మూడుపూటలా వచ్చి, కుయ్యోమని యేడ్చేది. వెళ్ళగొట్టినా వెళ్ళి మళ్ళీ వచ్చేది. దాని అవస్థ చూస్తుంటే ఇంట్లో వున్నవాళ్ళందరికీ కడుపు తరుక్కునిపోయేది. అమ్మ ఒకరోజు అన్నంముందు కూర్చుని కళ్ళనీళ్ళు పెట్టుకుందికూడా. అప్పటినుంచీ యింట్లో అందరికీ కూడా కుక్కను చేరదీయాలంటే భయమూ, దిగులూ అయేది.

ఓ సారి గాలివాన పట్టుకుని నాలుగురోజులదాకా వదలలేదు. ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. తలుపులు వేసినా, కిటికీ రెక్కల్లోంచి, తలుపు సందుల్లోంచి ఇల్లంతా తడిసిపోతున్నది. బయటప్రపంచ మంతా హోరుమని వొకటేవాన.

తలుపులు కొట్టినట్టుగా వినపడితే తానే వోరవాకిలిగా తెరిచి చూశాడు నారాయణరావు. కుక్కపిల్ల ఒకటి చలికీ, వానకూ ముద్దయిపోయి వొణుకుతూ, కాళ్ళతో తలుపును రాస్తున్నది. తలుపు తెరవగానే నిస్సహాయంగా చూసింది. ఆ చూపు కడుపులో చేయిపెట్టి కెలికినట్లైంది నారాయణరావుకు. ఇంకొంచెంసేపు


చేశాడు. ఒక్క దూకుతో లోపలకు వచ్చి పడింది కుక్కపిల్ల. పెట్టెల చాటుకు చేరి ముడుచుకొని పడు కున్నది. తరువాత రెండురోజులకు కాని వాన తగ్గలేదు. ఈ రెండు రోజులూ పడుకున్నచోటును వదిలి పెట్టలేదు కుక్కపిల్ల. ముడుచుకొని పడుకుని అర్ధనిమీలిత నేత్రాలతో మహదానందం అనుభవించసాగింది. ఏమన్నా పెట్టినాకూడా తినలేదు. వానవెలిసి, గాలి హోరుతగ్గి, ఆకాశం నిర్మలమై, ఎండ కాసినతరు వాతకూడా ఆ కుక్కపిల్లను ఇంట్లోంచి ఎవరూ వెళ్ళగొట్టలేక పోయారు. వెళ్ళగొడదామని ఎంత ప్రయత్నించినా, ఏ అర్థరాత్రో వచ్చి, ఓ మూల ముడుచుకొని పడుకొనేది, కాలి గోళ్ళతో తలుపులు గీరి, తలుపు తెరవగానే లోపలకు దూరేది. ఆరు నెలల్లో అందరికీ మాలిమైపోయింది. ఒకపూట ఒక కరుడు అన్నంపెడితే కుటుంబంలో తానూ ఒకతెగా మెలిగి పెద్దదైంది.

కాని ఒకరోజు చొంగ కార్చు కుంటూ ఇంటికి వచ్చింది. ఇంటిలో నడచినంత మేరా చొంగ. మూతి మధ్యలో పెద్ద రాయి ఇరుక్కొని పోయినట్లుగా చీలిపోయింది. రెండు దవడలూ కలుసుకోవటమే లేదు. నారాయణరావు పరీక్షగాచూశాడు. ఏదో పెద్ద ఎముక విరిగినట్లుగా వుంది పళ్ళసందున. ఇంటో వాళ్ళంతా దాన్నిచూసి అసహ్యించుకున్నారు. అన్నంపెడితే తినలేకపోయింది. పాలు పోస్తే కతకలేకపోయింది. వారం రోజులు అలానే బాధపడింది, కడు పులోకి ఏమీ ఆహారం లేకుండానే. తరువాత వెటర్నరీ హాస్పిటల్ కు తీసుకువెళితే ధనుర్వాతమో-ఏదో వాతమో, అన్నారు. తరువాత రెండు రోజులకు చచ్చిపోయింది.

ఇంకోసారి చిన్న కుక్కపిల్ల బజారులో బండి కింద పడి నలిగి పోవటం చూశాడు. ఇంకో గజ్జి కుక్కపిల్లను, పెద్ద కుక్కలన్నీ పీకి పెట్టడం చూశాడు. ఇవన్నీ నారాయణరావుకు ఆ రాత్రి కళ్ళముందు తిరిగినయ్. ఇవే కలలు.

ప్రొద్దున లేవగానే నారాయణ రావు ఏపనీ చేసుకోలేక పోయాడు. తన చెప్పులు దేవాలయంలో పోయి నవని, ఎవరో దొంగ ఎత్తుకుని పోయినారని ఎవరితోనూ చెప్పలేదు. అట్లా చెప్పటంకాని, ఆ ఆలోచన మనసులోకి రావటంకాని, అతని కెంతమాత్రమూ ఇష్టంలేదు. పక్క రూంలో వుంటున్న స్నేహితుణ్ణి అడిగి అప్పుతీసుకుని, ఆ సాయం కాలమే బజారుకు వెళ్ళి నారాయణ రావు చెప్పుల జత తీసుకున్నాడు. అవాళ క్లాసులకు కూడా హాజరు కాలేక పోయినాడు.






ఆ సాయంకాలానికే దేవాల యానికి వెళ్ళి దేవుడిముందు నిలబడి మనస్సునంతా ఏకాగ్రంచేసి, కళ్ళు తడిసి పోతూ వుండగా, తన చెప్పులు ఎత్తుకొనిపోయిన అతడు వాటిని కావాలని దొంగతనం చేసివుండడనీ, పొరపాటున తన చెప్పులే ననుకొని తొడుక్కొని వెళ్ళివుంటాడని ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకొని పొర పాటు జరిగినందుకు నొచ్చుకుని వుంటాడని, ఒకవేళ, పొరపాటున, తెలియక, మూర్ఖత్వంవలన, బీదతనం వలన, కావాలనే తీసుకొని వెళ్ళినా, తన మీదదయచూపి, అతణ్ణి రక్షిం చాలనీ, ఈచిన్న తప్పుకు అతడికి కుక్క జన్మ ససేమిరా రాకుండా వుండాలని, నారాయణరావు ఎంత గానో ప్రార్థించాడు. అప్పటికిగాని అతడి మనసు తేలిక పడలేదు. అప్ప టికిగాని వీధిలో కుక్కను చూసి నప్పుడు మనస్సు వులికి పడటం నుండి తేరుకోలేదు. సింహద్వారం బయటికివచ్చి భయం భయంగా తన చెప్పులు తొడుక్కొని ఏవేవో ఆలో చనలతో కళ్ళుతుడుచుకుంటూ బస్ స్టాపువరకూ నడచివచ్చి, యథా లాపంగా తన చెప్పులవేపు చూసు కుంటే. "అయ్యో భగవంతుడా? ఈ చెప్పులు ఇవాళ తాను కొన్నవేనా?" అన్న ప్రశ్నమళ్ళీ అతడికళ్ళుతడిపింది.

□□□